పుట్టుమచ్చ

★

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

మనిషికి మరుపెందుకు వస్తుందో!—
ఎప్పుడు వస్తుందో!—

ఈవిషయాలు సరిగా ఊహించగలిగితే తను మరిచిపోయిన విషయమేదో ఇట్టే జ్ఞప్తికి తెచ్చుకో గలననుకున్నాడు రామూర్తి చిట్టచివరికి.

మరిచిపోయిన విషయాన్ని వదిలి, తనకున్న సైకాలజీ పరిజ్ఞానాన్ని తిరగదోడుకోవటం మొదలు పెట్టాడు తనకు తెలీకుండానే!—అత్యంతాసక్తితో ఒకటి తరవాత ఒకటి సైకాలజీ పుస్తకాలు రాత్రింబవళ్లూ అదేపనిగా చదవటం; ఒకనాడు అర్ధరాత్రి దాకా చదివి పుస్తకంలో విషయాలు తనకు అన్వయించుకుంటుంటే తనకుతనే పరమ కిరాతుడిలాగా తోచటం; లైటు ఆర్పివేయబోతూంటే అద్దంలో కనిపించిన తన బొమ్మను చూచుకుని కెవ్వుమని కేక వెయ్యబోవటం—ఇత్యాది ఘట్టాలన్నీ మనఃఫలకం మీద బొమ్మలు కడుతున్నై.

సిగరెట్టు ముట్టించి దమ్ములాగి ఫక్కుమని నవ్వాడు రామూర్తి.

ఒంటరిగా నిలబడి అంత నవ్వు నవ్వినందుకు పక్కనున్న వ్యక్తి భయపడుతూ రామూర్తివైపు చూచాడు.

రామూర్తి స్పృహలోకి వచ్చాడు. ప్లేవుమెంటుమీద నిలబడ్డ మరెవ్వరూ తన నవ్వు పట్టించుకోనందుకు తృప్తిపడ్డాడు. తనకు తెలీకుండా సైకాలజీ ఊబిలోపడి నవ్వుపాలయానని నాలిక కరుచుకున్నాడు.

తను మరిచిపోయిన విషయమేదో జ్ఞాపకం రాలేదు. అదేదో తన బావమరిదికి చెప్పాలనుకున్న పరమరహస్యం!

మస్తిష్కంలో మరుగుపడిఉన్న భావాలన్నిటినీ కుళ్ళగించటానికి శాయశక్తులా పూనుకున్నాడు. కాని, అంతుదొరికే సూచనలేవీ లేవు. విసిగి 'లాభంలేదు......వాడితో కబుర్లాడటంలో అదే జ్ఞాపకం వస్తుందిలె' ననుకునే లోపల సుందర్రావు రామూర్తి ముందునుంచి వెళ్ళటం, అది తను గమనించకపోవటమూ రెండూ జరిగిపోయినై.

ఆ విషయం సుందర్రావు బారెడుదూరం వెళ్ళిన తరవాత కాని రామూర్తి గ్రహించలేదు.

ఇవాళింత పరాకుగా ఉన్నానేమను కున్నాడు. అంతేగాని, అప్పుడైనా గ్రహించలేక పోయాడు మరుపెందుకు వస్తుందో, ఎప్పుడు వస్తుందో!

'సుందరం! సుందరం!!' రామూర్తి బొబ్బ లెట్టుకుంటూ ప్లేవుమెంటుమీద నడక, పరుగుకాని విధంగా అటువైపు బయలుదేరాడు.

ఈ పిలుపులేవీ విననట్టు ఎదురుగుండా ఆగి ఉన్న బస్సులో పడ్డాడు సుందర్రావు ఒక్క గంతులో. అంతేకాదు, రామూర్తి వచ్చేలోపల బస్సు కదిలిపోతే బాగుండునని కూడా అనుకున్నాడు!

'ఒరే! బావా! నిన్నేరా!' రామూర్తి నడకమాని పూర్తిగా పరుగు ప్రారంభించాడు నవ నాగరికతల కాలవాలమైన త్యాగరాయనగరు ప్లేవుమెంటుమీద!

బస్సు కదులుతున్న చప్పుడైంది.

సుందర్రావు 'అమ్మయ్య!' అనుకున్నాడు.

ఇంతలో, వెనకనుంచి 'హోల్డాన్!' అన్న కండక్టరు గదమాయింపు బాకుతో వెన్నులోపొడిచి నట్టు వినిపించింది సుందర్రావుకి.

బస్సులో ఎవరో ఎక్కారు. వెనక్కు తిరిగి చూడటానికి మెడతిప్పే ఓపిక నశించింది సుందర్రావులో అనుమానమేమీ లేదు—ఆ ఎక్కింది రామూర్తే!

రొప్పుకుంటూ వచ్చి పక్కన కూర్చున్నాడు రామ్మూర్తి!

సుందర్రావు మెడ కేదో ఉచ్చు బిగిసినట్లనిపించింది. బాధపడుతున్నట్టు మెడ అటూ ఇటూ తిప్పి 'ఏరోయ్, బావా!' అంటూ పరామర్శించాడు.

'చాల్లేరా! మరీ వేషాలు పోతున్నావు! అల్లంత దూరాన్నుంచి గావుకేక లెట్టినా పలక్కుండాను...'

'అబ్బే, నిజంగా......నన్ననుకోలేదురా!' నమ్మించటానికి చెయ్యతగ్గ అభినయమంతా చేశాడు సుందర్రావు.

'ముక్కు మొగ మెరగని కండక్టరు నేను పిలుస్తున్నది నిన్నేనని బస్సు ఆపాడుగాని, నీకు తెలీనే లేదుట! సరిగ్గా అబద్ధాలాడటమైనా నేర్చుకోరా!'

సుందర్రావు రామ్మూర్తి మాటలు పట్టించుకోనట్టు పెడమొగం పెట్టి కూర్చున్నాడు. బావమరిది మాట కట్టించటానికి సుందర్రావు తరుచు ఆచరించే ప్రక్రియలో ఇది ఒకటి. తను సమాధానం చెప్పకండా ఊరుకున్నాడంటే మరొక నాలుగు పరవళ్ళ తరవాతనైనా రామ్మూర్తి నోరుకట్టెయ్యకపోడని సుందర్రావు నమ్మకం.

రామ్మూర్తిది అదొక తరహా—మెడ్రాస్ అయేది, అపైన లండన్ అయేది మన అలవాట్లు, మన ప్రవర్తన మారవలసిన అవసరం లేదు—అంటాడు. ఈ విషయంలో వాడితో ఇతరులు ఏకీభవించకపోయినా వాడికి చింత లేదు.

రామ్మూర్తి ప్రవర్తనలో ఉన్న ఈ మొరటుదనంవల్ల ఎక్కువ బాధకు గురిఅయింది సుందర్రావు. మన ప్రాంతపు అలవాట్లన్నీ మన ప్రాంతాల్లోనే వదిలి మరీ కలకత్తా మెయిల్లో అడుగుపెట్టేవాడు. కాని, రామ్మూర్తి మాత్రం ఆ మర్యాద దక్కనిచ్చేవాడు కాదు.

అంతేకాదు—ఎదురైన మరుక్షణంలో తనకి తానుగా పెద్దరికం వహించి 'చిరంజీవ!' అని దీవిస్తాన్నట్టు మాట్లాడేవాడు సుందర్రావుతో.

మనః ప్రవృత్తుల్లో ఉన్న ఏ విశేషంవల్ల రామ్మూర్తికి ఆ అధికారం వస్తోందో, ఏ లోపంవల్ల తనకి చిన్నరికం వస్తోందో బోధపడక పోయింది సుందర్రావుకి. అనేకసార్లు అనుకునేవాడు—అతని కంటే ముందు ఆ పెద్దరికం అంది పుచ్చుకుందామని. కాని, సుందర్రావు కది సాధ్యం కాకపోయేది.

బస్సు కండక్టరు టిక్కెట్లు ఇచ్చుకుంటూ వస్తున్నాడు వెనకనుంచి.

'చంద్రమౌళిని చూచిరావటానికి వస్తానని... ఈ వేళకు నన్నిక్కడుండమని...ఇలా మొహం తప్పిస్తున్నా వెక్కడికిరా?' రామ్మూర్తి మళ్ళీ అందుకున్నాడు.

ఈ ప్రశ్న తనమీద విరుచుకుపడక పోదని, ఇందాకటినుంచీ సమాధానంకోసం సతమతమౌతున్నాడు సుందర్రావు. కాని, సమాధానం తోచేలోపలే రామ్మూర్తి ఈ ప్రశ్న వెయ్యటంతో—ఏదో ఆ సరా అందుకునే లోపల కాళ్ళకింద ఆధారం లాగివేసినట్లయింది సుందర్రావుకి.

'క్షమించరా బావా! చంద్రమౌళి ఇంటికి వద్దామనే బయలుదేరాను కాని, అర్జెంటు పనొచ్చింది...మరొకచోటికి వెళ్ళాలి''...అన్నాడు తడబడుతూ.

"ఎక్కడికిరా?"

సుందర్రావుకి వళ్లు మండింది. 'పారీస్‌కి!' అన్నాడు పడతిడుతున్నంత అసహ్యం గొంతులోకి తెచ్చుకుని.

రామ్మూర్తి వెకిలిగా నవ్వుతూ, ''మిడతంభొట్లూ! నువ్వు పన్నెండో నెంబరు బస్సులో ఎక్కి పారీస్‌కి వెడుతున్నావట్రా?'' రామ్మూర్తి ఇంకా నవ్వుతున్నాడు.

అవతలివాళ్ళ ప్రాణాలుతోడి, అడ్డమైన అవాకులు, చెవాకులు వాగించి తను సంతోషించే వెధవ స్వభావం తన బావమరిదిది అనుకున్నాడు సుందర్రావు.

నిజానికి, తను బస్సులో ఎక్కేముందు అది ఎక్కడినుంచి ఎక్కడికి పోయేదో చూడలేదు. రామ్మూర్తి కంటపడకండా ఉంటే చాలునని ఆగి ఉన్న బస్సులో దూరాడు. మరి డిటెక్టివ్‌ని మించి ఇలా ప్రాణాలుతీస్తే తనేమి చెయ్యగలడు?

'తెలివి తక్కువగా ఆడిన అబద్ధాన్ని ఇప్పుడైనా కప్పిపుచ్చుకోరా—వెళ్ళవలసింది పారీస్‌కే... కాని, మైలాపూరుపోయి, సుబ్రహ్మణ్యంతో కలిసి అటునుంచి అటు పారీస్ పోదామనుకున్నాను—అని!'

ప్రాణం నిలువునా తీశాడనిపించింది సుందర్రావుకి—తనుపడ్డ ఈ ప్రమాదంనుంచి తప్పుకోవటానికి తను చెప్పాలనుకుంటున్న సాకుకూడా అదే! అది కాస్తా రామ్మూర్తిముందే చెప్పేశాడాయె. ఇప్పుడు తను మళ్ళీ వాటినే పునశ్చరణచేస్తే ఏం అతికిచస్తయ్యి!

మరి వేరే ఆలోచనకూడా తోచటంలేదు.

'నిజంగారా! నమ్మితే నమ్ము; లేకపోతే లేదు—సుబ్రహ్మణ్యం దగ్గిరికే నేను వెడుతున్నది. ఆపైన పారీస్‌లో అర్జంటుపనుంది ... తలపోయే విషయం...' ఎంత నొక్కిచెప్పినా ఎబ్బెట్టుగానే అనిపిస్తోంది సుందర్రావుకి. కాళ్లు, చేతులు కట్టివేసి తన బావమరిదిని పరుగెత్తే బస్సునుంచి విసిరి అవతల పారేస్తే బాగుండు ననిపించింది!

సుందర్రావు పడుతున్న ఈ ఇరకాటమంతా గ్రహించి సంతోషిస్తున్నవాడిలాగా ‘‘అబద్ధాల ఊబిలో ఏం దిగబడిపోతున్నావురా! అబ్బ! నాకు తెలుసురా—ఈ సుబ్రహ్మణ్యాలు, ఈ తలపోయే పనులూ—అన్నీను! క్షణంక్రితమే సుబ్రహ్మణ్యం కనిపించాడు. నీతో మాట్లాడి వస్తున్నానన్నాడు! వెనకెప్పుడో అనుకున్నారుట—మీ రిద్దరూ మిడ్లాండుకి మాటినీకి పోదామని! కానీ, అనుకున్న సినిమా కాకపోవటంవల్ల వెళ్ళటం సంక్షేపించుకున్నారుట! —ఇదేనా సుబ్రహ్మణ్యాన్ని కలుసుకోవటమూ, తలపోయే పనీను?’’ అన్నాడు రామ్మూర్తి.

సుందర్రావు తెల్లపోయిచూస్తూ ఉండిపోయాడు. చెప్పిన అబద్ధాన్నల్లా రామ్మూర్తి ఎగరేసి తెగనరుకుతూంటే తనేమి మాట్లాడగలడు?

'ఎంగె పోణుంసార్?' అన్నాడు కండక్టరు, కబుర్లుమాని టిక్కెట్టు ప్రసక్తి ఎంతసేపటికి ఎత్తుతారో చూదామని తనూ అంతసేపు కాచుకు కూర్చున్నట్టు.

'రెండు ట్రిప్లికేన్' రామ్మూర్తి జేబులోనుంచి డబ్బు తీస్తున్నాడు.

సుందర్రావు బిక్కగా కండక్టరువైపు చూస్తున్నాడు. 'ఇది ట్రిప్లికేన్ పోవాదుసార్! ఇది '12. A' మైలాపూర్ చిత్రకోళందానే పోను' కండక్టరు ఈ మాటలనేసరికి—సుందర్రావు తెరిపిని పడ్డాననుకున్నాడు.

'ఐతే, రెండు లజ్ !'

టిక్కెట్టును గురించిన సంభాషణలో, పరుగెత్తుతున్న బస్సు రొదలో...సుందర్రావు తను ట్రిప్లికేన్ రానుగాక రానన్న మాటలు తుడిచిపెట్టుకుపోయినై.

'నాకు తెలుసులేరా. నువ్వు ఎత్తిన ఎత్తేమిటో—నన్నిక్కడ పడిగాపులు పడమని నువ్వు ఒక్కడివీ చంద్రమౌళి ఆతిథ్యం అందుకునేందుకు బయల్దేరావు!' రామ్మూర్తి ఆడిపోసుకుంటున్నాడు.

అలా కవ్విస్తూంటే నిజమే నన్నట్టు నోరుమూసుకు కూర్చోటం ఎలా?

పైగా, చంద్రమౌళి తనకు ముఖ్య స్నేహితుడు. తన్ని వాళ్లింటికి ఆహ్వానిస్తూ, బావమరది కదా అని మర్యాదకోసం పక్కనున్న రామ్మూర్తిని కూడా రమ్మన్నాడు. అంతమాత్రానికే చంద్రమౌళి ఇంటికి వెళ్ళటానికి తనకంటెకూడ ఇంత ఆసక్తి చూపుతాడేమిటి? విపరీతం! ఇలాంటి వెకిలితనం రామ్మూర్తికి కొత్తకాదని సుందర్రావుకి తెలుసు.

'ఒక్కణ్ణే వెడదామనుకుంటే వెడదామనుకున్నానులేరా...' అన్నాడు సుందర్రావు—బస్సు దిగిన తరవాత మాట్లాడుకుందాం ఆ గొడవలన్నీ—అనే మాటలు స్ఫురించేటంత విసుగ్గా.

‘‘ఇద్దర్నీ కాఫీకి రమ్మని పిల్చాడా లేదా చంద్రమౌళి?’’

సుందర్రావు సమాధానం చెప్పకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

'మరయితే అంతస్వార్థమెందుకు? అంతా నువ్వే బావుకోవాలేం...'

సుందర్రావు ఇంకా మౌనంగానే ఉన్నాడు. మాటవరసకి రమ్మంటే ఎందుకు వీడికింత ఉబలాటం? తను అక్కడికి వెళ్ళటానికి ఇష్టంలేదని తెలియబట్టే వీడింత రెచ్చిపోతున్నాడేమోనని వెనకటి తన

ప్రవర్తనకి లోలోపల విచారపడటం మొదలుపెట్టాడు సుందర్రావు.

రామ్మూర్తికూడా వాగ్ధోరణి కట్టిపెట్టాడు.

రామ్మూర్తి మనసులో ఏదో లీలగా మెదలటం మొదలుపెట్టింది. ఆలోచనలో పడ్డాడు. ఆలోచించినకొద్దీ ఏదో చీకట్లో తడుముకొంటున్నట్లుంది తప్పితే విషయమేదో వెలుగులోకి రావటం లేదు.

అంతసేపూ రామ్మూర్తి ఊహల్లో చంద్రమౌళి మెదులుతున్నాడు. ఏమిటి చంద్రమౌళిని గురించినది? ఏమో! చటుక్కున, అతడి ఆతిథ్యం జ్ఞాపకం వచ్చింది. ఇలా ఆలోచిస్తూంటే విషయాన్నుంచి దూరమౌతున్నట్లు కూడా అనిపించింది, మళ్లీ—

చంద్రమౌళి చాలా కలుపుగోలుతనంగల మనిషి. ఒకనాడు మౌంటురోడ్డులో సుందర్రావుకి ఎదురై పట్టరాని ఆవేశంతో పరామర్శించాడు. మజ్జా హోటల్లో కూర్చుని పూర్వస్నేహాన్ని అదేపనిగా నెమరువేశాడు.

'చాలా మారిపోయావ్' అన్నాడు సుందర్రావు మాట్లాడుతున్నంతసేపూ చంద్రమౌళిని అదేపనిగా చూస్తూ.

చంద్రమౌళి వస్తుతః స్ఫురద్రూపి. మిగతా ఆకారం తేలిగ్గా ఊహించుకోవచ్చు—కవి; అందులోనూ భావకవి కూడాను! పూర్వంనుంచీ చంద్రమౌళికి కవిత్వధోరణి ఉండేది. వాడు రాసినవేవీ సుందర్రావు చదవటమైతే చదవలేదుగాని, చాలా పత్రికల్లో అచ్చవటం ఎరుగున్నాడు! ఉచ్చుపట్టలేక వాడి గొడవలెవ్వో వాడు పత్రికలనిండా చెడరాసుకుంటుంటే అవన్నీ చదవవలసిన శిక్ష మనకేమిటని పించేది సుందర్రావు ఇత్యాదులకి!

మొత్తానికి వీడికేవో ప్రేమగొడవలుండి ఉంటై. లేకపోతే ఇంతచేటు గోలెత్తడు పత్రికల్లో—అనుకునేవాళ్లు చంద్రమౌళినిగురించి సుందర్రావు వగైరా మిత్రులు. కాకపోతే, పొరుగూరినుంచి వచ్చి కాలేజీలో చదువు వెలిగిస్తూన్న చంద్రమౌళి గుట్టూమట్టూ తెలిసేదికాదు వాళ్ళకి. ఇంతలో, బియ్యేలో చేరినవాడు కాస్తా, హఠాత్తుగా చదువుకి స్వస్తిచెప్పి యుద్ధంలో చేరి అటుశత్రువులమీద బాంబులు విసరటంతోపాటు ఆంధ్రదేశంమీద విరహగేయాలుకూడా వదలటం ప్రారంభించాడు.

మళ్ళీ ఈనాడు మద్రాసులో ప్రత్యక్షమయాడు చంద్రమౌళి! 'ఎప్పుడొచ్చావ్?' అన్నాడు సుందర్రావు, 'ఎన్నాళ్ళకు కనిపించాం!' అన్నంత పరామర్శగా.

చంద్రమౌళి చాలా కులాసాగా ఉన్నాడు. 'రావటమేమిటి? ఇక్కడే ఉంటున్నాను!' అన్నాడు.

'ఏం చేస్తున్నావ్?' అన్నాడు రామ్మూర్తి కేవలం పరామర్శిస్తున్నట్టు.

'పత్రికా సంపాదకుడుగా కాలం గడుపుతున్నాను' అని ఒక చిరునవ్వు నవ్వాడు. ఇంతవరకు తన జీవితం ఎన్ని విపరీతమైన దారులు తొక్కిందీ జ్ఞాపకం వచ్చి తనకి తనే నవ్వుకుంటున్నాడేమోనని పించింది సుందర్రావుకి.

'వివాహమయిందా?' అని అడుగుదామని నోటిదాకా వచ్చింది సుందర్రావుకి. కాని, అన్ని విరహగేయాలు వ్రాసిన వాణ్ణి అంత సూటిగా ఆ విషయం అడిగితే ఎటు పోయి ఎటు వస్తుందోనని విరమించుకున్నాడు.

కాని, చంద్రమౌళి ఇష్టసిద్ధుడివలె ఉన్నాడు!

మిత్రులిద్దరూ ఇంతచేటు పరామర్శించుకుంటుంటే రామ్మూర్తి మెదలకుండా కూర్చున్నా, వాళ్ళతో బాటు ఒకటి తరవాత ఒకటిగా సిగరెట్లు మాత్రం తగలేస్తున్నాడు. నిజానికి, తనుకూడా మాట కలపతగ్గ విషయం ఒక్కటి కూడా లేదు వాళ్ళ సంభాషణలో.

చంద్రమౌళి బిల్లు చెల్లించి బైటికివస్తూ 'రేపు ఆదివారం మా ఇంటికి రారా... కాఫీవేళ కల్లారా... భోజనాలు కూడా మా ఇంట్లోనే...మరిచిపోకు' అని రామ్మూర్తితో 'మాష్టారూ! మీరు కూడా రావాలి.' అని వెంటపెట్టుకువచ్చే బాధ్యత సుందర్రావుకి పురమాయించాడు. తన ఎడ్రస్ చెప్పి ట్రిప్లికేన్ బస్ స్టాప్‌కి పరుగెత్తాడు చంద్రమౌళి.

చంద్రమౌళికి పెళ్లి అయివుంటుందనుకున్నాడు సుందర్రావు. అతగాడు చేసిన బహువచన ప్రయోగం చెవుల్లో రింగురింగుమంటోంది.

‘ఎవత్తో ఈ కవిరాట్టు?’ అన్నాడు రామ్మూర్తి చంద్రమౌళి బారెడుదూరం సాగగానే. సుందర్రావు తనకు తెలిసిన వివరాలన్నీ చెప్పాడు.

‘ఐతే, ఈ మహాకవి కావ్యవస్తువు మనం చూడ తగ్గదే! మన ప్రయాణం మరిచిపోకు!’ చంద్రమౌళి భార్యను చూడాలని తనుకూడా నిజానికి కుతూహల పడుతున్నా, ఆ విషయాన్ని రామ్మూర్తి బైటికి అనేసినందుకు పట్టరానికోపం వచ్చింది వాడిమీద.

తరవాత, సుందర్రావు కనిపించినప్పుడల్లా రామ్మూర్తి జ్ఞాపకంచేశాడు ఆదివారంనాటి తమ కార్యక్రమం. మాటవరసకి రామ్మూర్తిని పిలవగా వాడింత ఆసక్తి చూపించటం సుందర్రావుకి చాలా చికాకనిపించింది.

రామ్మూర్తి నిజంగానే అనుకున్నాడు—తను బాధపడి, చంద్రమౌళిని బాధపెట్టి, వాడి గేయాలవల్ల ముక్కోటి ఆంధ్రుల్లో అక్షరజ్ఞానమున్న చాలా మందినికూడా బాధపెట్టిన ఆ యువతీలలామ శీల సౌందర్యాలు తను తెలుసుకోవాలని! ఇలా భావించటం తప్పేమోనని అప్పుడప్పుడు ఆత్మపరీక్ష చేసుకోకనూ పోలేదు! ఆ మాటకొస్తే—చంద్రమౌళికి ఆ అమ్మాయిమీద మోజుఉంటే ఉండిఉండవచ్చును. గాని, ఆ మోజుతో తన గేయాలద్వారా అశేష జనాన్ని ఉవ్విళ్లూరించగా లేనిది తను కేవలం జిజ్ఞాసువుగా ఆవిణ్ణి చూడాలనుకోవటంలో తప్పేమీ లేదనుకొని ఊరటపొందాడు!

కాని, రామ్మూర్తికున్న ఇంత ఉత్సాహం మరునాటికల్లా దిగజారిపోయింది—ఆ వ్యక్తి ఎవరో తెలిసేసరికి. ఐనా, తన బావమరిదితో హాస్యమాడటానికైనా ఈ ప్రయాణం పనికివస్తుంది లెమ్మని తృప్తిపడ్డాడు!

—రామ్మూర్తి పరాకుగా, సుందర్రావుతో మైలాపూరుకి బస్సులో ప్రయాణంచేస్తున్నా నన్న విషయం మరిచి, చంద్రమౌళిని కలుసుకుని ఇంటికి తిరిగి వస్తున్నామన్న భ్రాంతిలో పడ్డాడు! లేవమని సుందర్రావు మోచేతితో పొడిచేదాకా లజ్ వచ్చిందన్న తలంపే లేదు. రామ్మూర్తి మాట, పలుకు లేకుండా అంతసేపు బుద్ధిమంతుడివలె ప్రయాణం చెయ్యటం సుందర్రావుకికూడా ఆశ్చర్యంగానేవుంది.

బస్సు దిగంగానే సుందర్రావు రోడ్డు దాటి కాఫీహోటలువైపు దారితీశాడు. ‘ఇటెక్కడికిరా?’ అన్నాడు రామ్మూర్తి వెనకనుంచి.

‘కనిపించటంలా? హోటలుకి!’

‘ఒరే...అబ్బీ! మధ్యలో మళ్ళీ హోటలు తతంగం పెట్టక నా మాట విను. వాళ్లు ఈ పాటికే కనిపెట్టుకుని ఉంటారు’ ముఖ్యంగా తనకోసమే వాళ్లు కాచుకుని ఉంటారన్నట్టు అన్నాడు రామ్మూర్తి ఈ మాటలు! దాదాపు ఈ పిలవని పేరంటానికి రామ్మూర్తి ఇలా ఎగబడటం సుందర్రావుకి విపరీతమైన చికాకు కల్గిస్తోంది.

ఎలాగో హోటలుచేరి సాధ్యమైనంత టైము అక్కడ గడవటానికి వీలుగా రెండు స్పెషల్ మసాలా దోసెలు బాగా కాల్చి తీసుకురమ్మని పురమాయించాడు!

“నాకు తెలీక అడుగుతాను...ఏమిట్రా ఇదంతాను?” అన్నాడు రామ్మూర్తి కుర్చీలో కూలబడుతూ, చంద్రమౌళి ఇంటికి సుందర్రావు రావటానికున్న అభ్యంతర మేమో తనకు తెలియనట్టు!

“నేను అక్కడికి రాను!” అన్నాడు సుందర్రావు మొండిగా.

‘ఎందుకని?’

‘అదంతా అనవసరం’

‘ఏమిటో ఆ పరమ రహస్యం నాకు చెప్పటానికేం?’ అన్నాడు రామ్మూర్తి తెలియనివాడివలె.

‘నా రహస్యాలెవో నాకు లక్ష ఉంటై. అవన్నీ బైటికి ఎందుకు చెప్పాలేమిటి?’

‘పోనీ చెప్పవద్దులే, దాచి ఉంచుకో...నాకు తెలిసిన రహస్యాలెవో నేనే చెప్తాను బైటికి—మీనాక్షితో నువ్వు ప్రణయం అఘోరించబోతే జరిగిన రసాభాసమంతా చంద్రమౌళి ముందు కడిగి వేస్తాను...’

సుందర్రావు గుండె గుభేలుమంది. ఇప్పుడు ఆ మీనాక్షే చంద్రమౌళి భార్య అని రామ్మూర్తికి తెలిసి అంటున్నాడో తెలీక అంటున్నాడో సుందర్రావుకి బోధపడకపోయింది. అందులో రామ్మూర్తి కేదైనా దుర్బుద్ధి పుట్టాలే గాని అనుకున్నంతా చేసి తీరగల సమర్థుడు!

అడకత్తెర సందుపోకలాగున్న దనిపించింది తన పరిస్థితి సుందర్రావుకి. ఎదురుగా కూర్చున్న బావ మరిది తన కళ్ళకి యమదూతవలె కనిపిస్తున్నాడు.

ఒకవిధంగా ఆలోచిస్తే చంద్రమౌళి ఇంటికి వెళ్ళకపోవటంకూడా తప్పే. రమ్మని మరీమరీ ఆహ్వానించాడు. తన గొడవలేవీ అతనికి తెలిసినట్లు లేవు. వెళ్ళకపోవటమే అనుమానాలకు దారి తీయావచ్చునసలు! అంతకంటె బలీయమైన విషయం—మీనాక్షిని చూడాలని అతని హృదయం ఆరాటపడుతోంది—ఇంకా! ద్వేషం అనురాగానికి ప్రతిరూపమే అన్న సత్యం తెలుసుకోలేని అమాయకుడైన సుందర్రావుకి ఇలాంటి కోర్కె ఎందుకు కలుగుతోందో అర్థం గాకపోయింది!

ఆర్డరిచ్చిన మసాలదోసెల మాట, కూర్చున్న హోటలు మాటా మరిచి చాలరోజుల వెనక్కి దొర్లుకుపోయినై వాళ్ళి ఊహలు.

‘నీ జీవితమంతా ఒక పెద్ద తెల్లమతాబాల దీపావళిరా, బావా!’ అన్నాడు రామ్మూర్తి విరగబడి నవ్వుతూ.

నిజంగా అంతేనేమో ననిపించింది సుందర్రావుకి!

పూర్వంనుంచీ కూడా అంతే!—

క్షణంసేపు కుదురుగా కూర్చుని పుస్తకం తెరిచిన పాపాన పోకండానే బియ్యే మొదటి సంవత్సరమంతా గడిచిపోయిందని విచారించిననాటి సుందర్రావంత బుద్ధిమంతుడు మరొకడుండి ఉండడు. బడి, ఇల్లు—తప్పితే వేరే వ్యావృత్తి పెట్టుకుంటే మాట దక్కదు సుమా—అని ఒకటికి పదిసార్లు బుద్ధికి బుద్ధి చెప్పాడు. కాలేజీనుంచి ఇంటికి రావటమే తడవుగా రెండు మెతుకులు గొంతులో వేసుకుని మేడమీది తన గదిలో చేరి తలుపులు బిడాయించేవాడు. తరవాత చదివేవాడో లేదో కాని, పుస్తకం మాత్రం చేతి కంటుకుపోయేది!

తన చదువు సవ్యంగా సాగటానికి సుందర్రావు ఇంకా ఆలోచించిన ముఖ్యమైన మార్పులో ఒకటి—తన భార్య సరస్వతిని పుట్టింటికి పంపటం! ఈమాట చూచాయగా అందించేసరికే ‘ఇది మరీ బాగుంది! మీ చదువుకి నే నడ్డమా ఏమిటి? ఉరుము ఉరిమి మంగలంమీద పడిందట...అట్లా ఉంది మీ వరస; ఇంతకీ అబ్బాయిగారికి చదువు వంటపట్టక...’

వెధవ ఎడ్డేవాలు ఇదీను!—అనుకున్నాడు సుందర్రావు. అరాంగి అయ్యుండి తను పడుతున్న బాధ గుర్తించదేం? ‘అ! నువ్విక్కడుండటం నా చదువుకి అడ్డమే’ అన్నాడు సుందర్రావు చేతనైనంత కోపంగా.

“సరే ఐతే, ఇంకనుంచీ ఈ మేడపైకి తొంగి చూస్తే ఒట్టు! ఏం చదివి వెళ్ళబెడతారో అదీ చూస్తాను!” అంటూ గోముగా చూచింది భర్తవైపు.

తరతరాలుగా పురుషుల్ని పాశవశుల్ని చేసుకుంటూవచ్చిన స్త్రీజాతి బలమేదో ఆ చూపుల్లో ఉన్నట్లనిపించింది సుందర్రావుకి.

‘ఏమైనా నువ్విక్కడ ఉండటానికి వీల్లేదు!’ అన్నాడు మొండిగా.

“ఏమైనా నే నిక్కడినుంచివెళ్ళటానికి అంతకంటె వీల్లేదు!” అంది మరింత మొండిగా.

భార్యకు తనంటే భయభక్తులు లేనందుకు విచారించాడు సుందర్రావు!

ఇంతలో చెల్లెలు సుశీలకూడా తయారైంది అక్కడ! వదిన—మరదళ్లిద్దరూ కూడారంటే ఇక వాళ్ళను పట్టశక్యమే కాదు. ఎంత వద్దనుకుంటున్నా తను హాస్యగాడై తీరేవాడు!

ఆడవాళ్ళకు సహజమైన వన్నె, చిన్నెలన్నీ చేర్చి విషయమంతా సరస్వతిచెప్పగా విని, “...మరి కాదా ఏమిటి? వదినే! నువ్విక్కడికి రాకపూర్వం అన్నయ్య చదువు ఎంత గొప్పగా ఉండేదనీ? నీ మూలాన అన్నయ్యప్పుడిలా అయిపోయాడు కాని, పూర్వం వాడు చదువులోనిధలే!...”

వదినె—మరదళ్లిద్దరూ విరగబడి నవ్వటం మొదలు పెట్టారు.

“బాగాచెప్పావు! అసలు మనబంగారం మంచిదైతే...” నవ్వుతో సరస్వతి వాక్యం పూర్తిచేయలేక పోయింది.

సుందర్రావుకి పట్టరాని కోప మొచ్చింది. తను చెయ్యగలిగింది చేశాడు—అక్కడినుంచి వెళ్ళిపోయాడు! అక్కడుండటమల్లా మరింత నగుబాటు పాలు గావటమే. తను ఏ క్లాసులో ఎప్పుడు చేరినదీ,

ఎప్పుడు గట్టెక్కిందీ తిథి వార, నక్షత్రాలతో సహా బైటికి తోడకపోరు!

సుశీలకు చాలా గర్వం బలిసింది అనుకున్నాడు సుందర్రావు. అది స్కూల్ ఫైనల్ సవ్యంగా పరీక్ష అవటంవల్ల వచ్చిన ప్రమాదమిది అనికూడా అనుకున్నాడు! నిన్నగాక మొన్న ఇంటర్మీడియెట్‌లో చేరిందో లేదో ఎమ్మే డిగ్రీ పుచ్చుకోబోతున్నట్లుంది దాని ఉబలాటం!

సుందర్రావు ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా చాలా నిశ్శబ్దంగా వుంది. సరస్వతి, సుశీల...ఇద్దరిలోనూ పూర్వపు నవ్వులాట ధోరణేమీ లేదు. తన కోపాన్ని వాళ్లు కొంతవరకైనా పాటించారని సంతృప్తిపొందాడు సుందర్రావు.

తదేకదీక్షగా విద్యావ్యాసంగం రెండురోజుల పాటు జరిగింది.

మళ్ళీ మూడోనాడు పూర్వపు కేరింతాలతో ఇల్లంతా దద్దరిల్లిపోతోంది. గది తలుపులు ఎంత బిగించినా సుందర్రావుకి చిత్తైకాగ్రత కుదరటంలేదు. పుస్తకాలతో హోరాహోరిగా పోరాడుతోంది అతని మనస్సు.

“అన్నయ్యా! అన్నయ్యా!!” సుశీల దెబ్బలకి తలుపు పగిలిపోతుందేమో ననుకున్నాడు.

దఢాల్న తలుపుతీసి, ‘ఏమిటే? అంత కొంప మునుచుకుపోయినట్టు తలుపు బాత్తున్నావ్?’ కొట్టినంత కోపంలో అన్నాడు సుందర్రావు.

‘డిక్షనరీ కావాలి. అస్తమానం నీ దగ్గిర పెట్టుకూచుంటే ఎలా? మాకుమాత్రం అవసరముండదా?’

‘అయ్యో! నిఘంటువుల అవసరం మీకు కాకపోతే మాకా? మావేముంది వానాకాలం చదువులు!’ అని, ఈ ఎద్దేవాచాలనట్టు, ‘ఇంతోటి తట్టుబళ్ళ ఇంటర్మీడియెట్‌కే ఇంత హడావిడి చేస్తోంది.. ముందున్నై మాపాట్లు! అసలు దీన్ని స్కూల్ ఫైనల్ పరీక్ష చేసినవాడెవడో కాని ఆ దుర్మార్గుడు మా ప్రాణాలు నిలువునా తీశాడు!...’

ఇంతలో ఒక అపరిచిత స్త్రీ కంఠం అవతలినుంచి ‘సుశీలా! రావోయ్! ఒకమాటకి అర్థం తెలీకపోతే ముంచుకుపోయింది లేదు...’ అంటూ వినవచ్చింది.

సుందర్రావు గొంతు తడి ఆరిపోయింది! ఒక్క క్షణానికి తెప్పరిల్లి డిక్షనరీకోసం వెతకటం ప్రారంభించాడు. గదిలో ఎక్కడా లేదు.

వసారాలోకి వచ్చాడు.

మీనాక్షి కూర్చుని ఉంది.

ఇద్దరూ ఒక లిప్తపాటు తొట్రుపాటు పడ్డారు, తమకు తెలియకుండానే.

సుందర్రావు వెంటనే చూపు మరల్చుకున్నాడు మళ్లీ ఒకసారి మీనాక్షిని చూదామనుకున్నాడు. కాని చూడలేకపోయాడు. తడబడుతూ వెర్రిగా ఏవేవో గాలించటం మొదలుపెట్టాడు, డిక్షనరీకోసం! తన్నితాను సంబాళించుకుని, ఈ అర్థంలేని తన వెతుకుడు చూచి ఆ అమ్మాయి లోలోపల నవ్వుకుంటూ ఉండివుంటుం దనుకున్నాడు. ఎలాగో అక్కడినుంచి బైటపడ్డాడు.

తన గదిలోకి వచ్చి కూర్చున్న తరవాతకూడా ఒళ్లు చిన్నగా వణుకుతున్నది. తన కెందుకిలా ఉందో అర్థంగాకపోయింది సుందర్రావుకి, స్త్రీతో పరిచయంలేనివాడుగాదే తను!

ఆరోజుల్లో చదువుమీద ధ్యాసపోలేదు సుందర్రావుకినరాలు పట్లు తప్పి పనిచేస్తున్నై. మీనాక్షి బొమ్మనే చిత్రించుకుంటోంది అతని మనస్సు—ఆ బొమ్మ చాలా అలుక్కుపోయినట్టుంది. మీనాక్షిని మరోకమారు బాగా చూచివుంటే బాగుండే దనుకున్నాడు సుందర్రావు.

మరునాడు మీనాక్షి కాలేజీలో కనిపించింది. తను, సుశీల క్లాసు వదిలిపెట్టగానే వాళ్లె వెయిటింగ్ రూములోకి వెడుతున్నారు.

సుందర్రావు మనసుదీర తేరిపార జూచాడు. మీనాక్షేమీ కన్ను చెదిరేటంత అందగత్తె కాదనుకున్నాడు. చాలా నిరాడంబరంగా వుంది. కాని, వయసుని మించిన వ్యథ లేవో ఆ అమ్మాయిలో దాగి ఉన్నయ్యనుకున్నాడు సుందర్రావు.

ఆరోజుల్లా సుందర్రావు పరాకుగా నేవున్నాడు పరిసరాలని మరిచి అతని మనసు మీనాక్షినే చిత్రించుకుంటోంది. ఆనాడు తను సుశీలని చేసిన ఎద్దేవాలన్నీ తనకు అన్వయించుకుందేమోనని బాధపడ్డాడు.

సరస్వతి గదిలో ప్రవేశించటంతో అతని ఊహలన్నీ చెల్లాచెదరై పోయినై. భార్యమీద పట్టరాని కోపమొచ్చింది.

రెండు రోజుల తరవాత సుశీలతో పాటు మీనాక్షి ఇంటికి వచ్చింది. మేధావు లిద్దరూ చేరి $S=UT+\frac{1}{2}(AT)^2$ అనే ప్రాబ్లం సాల్వ్ చెయ్యటానికి పూనుకున్నారు. అవాళ్ళే మాస్టరు చెప్పిన పాఠమూ, అచ్చుపుస్తకము... రెండూ కూడా వాళ్ళకేమీ సహాయకారులు కాకపోయినై.

మీనాక్షి వద్దంటున్నా సుశీల అన్నయ్యని పిల్చింది. తనకు జ్ఞాపకమున్న ప్రాబ్లం అడిగినందుకు తన అదృష్టానికి తనే సంతోషిస్తూ తన తెలివితేటలు సాధ్యమైనంతవరకు వెల్లడయ్యేట్టు ఆ ప్రాబ్లం సాల్వ్ చేశాడు.

తరవాత వీలు కల్పించుకుని కాలేజీ విషయాలు మాట్లాడాడు కొంతసేపు. మధ్య మధ్య మీనాక్షిని గమనిస్తూనే ఉన్నాడు. కాని, మీనాక్షి ముఖం ఏ భావాలనీ వ్యక్తంచెయ్యటం లేదు! తను ఇవతలకు వచ్చిన తరువాత పూర్వపు హడావిడిలో వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నారు. మీనాక్షి తనముందు సిగ్గుపడి ఉంటుందనుకున్నాడు సుందర్రావు.

ఈ సంఘటన జరుగుతున్నంతసేపు సరస్వతి ఏదో పని కల్పించుకుని వచ్చిపోతూ తనవైపు కోర చూపులుచూస్తూ లేనిపోని హైరానపడటం సుందర్రావు గమనిస్తూనే ఉన్నాడు.

సరస్వతి గదిలో ప్రవేశించి 'అమ్మాయిల చొరవ తప్పితే అక్షర చొరవ లేదు అబ్బాయిగారికి! నిజమే, నేను పుట్టింటికి వెళ్ళక ఇక్కడెందుకు? పానకంలో పుడకలాగ!' అంది అటు తిరిగి.

సుందర్రావుకి పట్టరాని కోపమొచ్చింది. స్త్రీ హృదయం ఎంత పరిమితం అనుకున్నాడు! దానితోబాటు తన భావాలు హద్దులు లేకుండా విస్తరించటం మొదలుపెట్టినై. ఇలాటప్పుడు తను తప్పు చేస్తే ఏమి?—అనుకున్నాడు తప్పెరగని సుందర్రావు!

మీనాక్షిపాటి విద్యాగంధం తన భార్యకు లేకపోవటమే దీనికంతకూ కారణం. వీళ్ళ నందరినీమించిన అందం ఉండొచ్చుగాక! దానికితోడు నవనాగరిక లక్షణాలన్నీ అలవర్చుకుంది సరస్వతి—శరీరపు వంపులసొంపులన్నీ ఊరివాళ్ళ కళ్ళబడేట్టు బిగుతైన బ్లౌజు తొడుగుతుంది. చీర లోపలి పరికిణీ ఎదుటివాడికన్ను చెదిరేవిధంగా కనబడేలాగ అలంకరించుకుంటుంది. కాని, సరస్వతి సౌందర్యార్చన అంతవరకే—హైహీల్టుజోళ్ళు వేసుకునేవాళ్ళనీ లిప్‌స్టిక్ రాసుకునే వాళ్ళనీ చూచి పల్లదనపు మనుష్యులని వెక్కిరిస్తుంది కూడాను. ఈ నమ్రత, ఈ పోకులు మినహాయిస్తే పొట్టకోసి కంచుకాగడాలు పెట్టి వెతికినా అక్షరమ్ముక్క కనిపించదే!

మీనాక్షిని తల్చుకున్నకొద్దీ సరస్వతిలో అన్నీ లోపాలుగానే కనిపిస్తున్నవి! కేవలం తనలో ఉన్న పశుత్వంతప్ప ఇన్నాళ్ళైనా ఆమెతో ఎలా కాపరం చెయ్యగలిగానని ఆశ్చర్యపోవటం మొదలుపెట్టాడు!

ప్రేమ—మామయ్య ఇచ్చిన కట్నం, సరస్వతి బాహ్యసౌందర్యం, తనలో కలిగే తాత్కాలిక ఉద్రేకానికి సరస్వతివల్ల తను పొందే ఉపశమనం—వీటి మాయలోపడి ఈమాటకి అర్థమే గ్రహించలేకపోయాననుకున్నాడు. ఈ ప్రేమవాదంతో, మీనాక్షివైపు తన ఊహలు మొగ్గటంలో తప్పేమాత్రమూ లేదని అంతరాత్మ సుప్రీంకోర్టులో వాదించుకుని సుందర్రావు దావా గెల్చాననుకున్నాడు కూడా!

మీనాక్షి ఎదురైనప్పుడల్లా తనలో వచ్చిన ఈ మార్పు వ్యక్తం చెయ్యటానికి ప్రయత్నించాడు.

ఒకనాడు సుందర్రావు మేడమీది తన గదికిటికీముందు నిలబడి వీధిలోకి చూస్తున్నాడు ఆలోచనా రహితంగా. ఎదురుగుండా ఉన్న ఇంట్లో ఎవరో కాపురానికి ప్రవేశిస్తున్నారు. మీనాక్షీవాళ్ళు ఆ ఇంట్లో ఉందామనుకుంటున్నారని సుశీల చెప్పటం జ్ఞాపకం వచ్చింది సుందర్రావుకి. ఇంతలో సుశీల, మీనాక్షి ఆ ఇంట్లోనుంచి బైటి గుమ్మంలోకి వచ్చారు. సుందర్రావు చాలాసేపు చూస్తూ నిలబడ్డాడు.

అప్పటినుంచి—ఆ ఇంటికీ, ఈ ఇంటికీ రాకపోకలు మరింత ఎక్కువైనై. మీనాక్షితో తన పరిచయం స్నేహంగా మారింది—సరస్వతి అసూయ ద్వేషంగా మారింది. ఈ మార్పుక్రమం ఎటునుంచి ఎటో సుందర్రావు గ్రహించలేదు ఆ తొందరలో.

ఉన్నట్టుండి, మీనాక్షి ఈ ఇంటికిరావటం మానేసింది. కాలేజీలో కనిపించటం తప్పితే మీనాక్షి బైట కనిపించటమే లేదు.

ఈ మార్పుకి కారణం తన ప్రవర్తనపై ఆమెకు కలిగిన వైముఖ్యమేనని బాధపడ్డాడు సుందర్రావు! కాని, నిజం తెలిస్తే బాగుండునని ఆరాటపడ్డాడు కూడా.

మీనాక్షికి, సుశీలకీ కూడా జోస్తీ తగ్గిపోయినట్లుంది. అంత ప్రాణస్నేహం, ఇంత బద్ధవైరంగా ఎందుకు మారిందో వాళ్ళిద్దరికేతప్ప బ్రహ్మకుకూడా తెలీదు—సుశీలని అడిగినా చెప్పదనిపించింది సుందర్రావుకి!

ఐనా, ఒకనాడు ధైర్యంచేసి 'మీనాక్షితో వచ్చి కొట్లేటా వేమిటి?' అన్నాడు పరిహాసం మాటున ఔత్సుక్యం కప్పిపుచ్చుకుంటూ.

''అంత శ్రద్ధగా అడిగావేరోయ్!' అని తరవాత నెమ్మదిగా 'ఆ అమ్మాయికో పిల్లాడు పుట్టిపోయాట్ట ... పెళ్లికాకుండానే' అంది సుశీల మీనాక్షిమీద తన కసి తీర్చుకుంటున్నట్టు.

సుందర్రావు తలమీద పిడుగుపడ్డట్టయింది. ఒక క్షణానికిగాని తెప్పరిల్లలేకపోయాడు. ఒకవేళ ఈ విషయం నిజమే ఐనా, ఇలా చెప్పేనందుకు చెల్లెలిమీద పట్టరాని అసహ్యం వేసింది. సుశీల మీనాక్షితో మాట్లాడకపోవటానికి ఇదిమాత్రం కారణంగాదనిపించింది. మరేదో కారణంగావచ్చిన ఆ వైరంలో తన పగ సాధించటానికి మీనాక్షి ఈ రహస్యాన్ని సుశీల బట్టబయలు చేస్తోం దనుకున్నాడు సుందర్రావు.

'ఇది నీ కెలా తెలుసు?' అన్నాడు.

'వదినెకి రామ్మూర్తిబావ చెప్పాట్ట! ఈ అమ్మాయిది వాళ్ళ ఊరేట!' అంది సుశీల.

సుందర్రావు మరేమీ మాట్లాడలేకపోయాడు. ఈ మాటల్లో నిజానిజాలు ఇప్పట్లో తేలటానికి వీలు లేనివి. చెల్లెల్ని చూచివెళ్ళటానికి వచ్చిన ఆ పెద్ద మనిషి దాచివుంచమని ఆవిడ చెవిలో ఊదివెళ్లాడు కాబోలు!

కాలేజీలో కొంచెం వాకబుచెయ్యగా ఈ రహస్యం ఇంతవరకు తెలియకుండా ఉన్నది తన కొక్కడికేనని గ్రహించాడు సుందర్రావు. ఇంటి దగ్గరి అమ్మలక్కలకు ఈ శుభవార్త తన భార్య ఈ పాటికి ఎప్పుడో అందించివుంటుందనికూడా అనుకున్నాడు.

తనవాళ్లవల్ల మీనాక్షికి జరిగిన ఈ అన్యాయానికి తన సానుభూతి తెలియజెయ్యా లనుకున్నాడు! ఎలాగైనా మీనాక్షిని ఒకసారి కలుసుకోవా లనుకున్నాడు.

ఒకనాటి సాయంత్రం వాళ్ల ఇంట్లోవాళ్లు ఎక్కడికో వెడుతున్నారు మీనాక్షి బండిలో ఎక్క లేదు. ఇంట్లోనే ఉండి ఉంటుందనుకున్నాడు. క్షణమాత్రంలో, ఒక్క అడుగులో...ఆ ఇంట్లో ప్రవేశించాడు. అంత ధైర్యం ఎలా వచ్చిందో తనకే తెలీదు.

సుందర్రావు వచ్చిన అలికిడికి మీనాక్షి ముందు హాలులోకివచ్చి క్షణంమాత్రం తొట్రుపడి తేరుకుని 'కూర్చోండి' అంది తనుకూడా కూర్చుంటూ. సుందర్రావు చాల ప్రమాదభరితమైన సంభాషణ సాగించటానికి వచ్చాడని పసికట్టినట్టు చాలా నిబ్బరంగా కూర్చుంది మీనాక్షి. కాని, ఎంత దాచినా మనసులో పడుతున్న చికాకును ముఖం వ్యక్తం చేస్తూనేఉంది!

ఇక్కడకు బయలుదేరినప్పుడున్న చిత్తస్థైర్యం దిగజారిపోయింది సుందర్రావులో. తను చెప్పాలనుకున్న మాటలు చాలవరకు మరిచిపోవటం మొదలు పెట్టాడు.

'నీకు చాలా అన్యాయం జరిగింది మీనాక్షీ!' అన్నాడు తడబడుతూ.

కడప్రాణంతో ఉన్న తనని పూర్తిగా హత్య చేసిపోవటానికి వచ్చాడు సుందర్రావు అనుకుంది మీనాక్షి! సరస్వతి, సుశీల ద్వేషభావాలతో తన హృదయాన్ని గాయపరుస్తే, సుందర్రావు సాంత్వన వచనాల పేరుతో తన వెన్నులో పొడవవచ్చాడు ఎవరికి కావాలీ సానుభూతి—అనికూడా అనుకుంది మీనాక్షి!

'ఫరవాలేదు లెండి' అంది తను అట్టే బాధపడనట్టు.

వితరణ కోల్పోయి ఉద్రేకంలో తను గడిపిన ఒక క్షణాన్ని పురస్కరించుకుని తెలిసినవాళ్లంతా ఇంతశ్రద్ధగా ఇంత అక్కసు వెళ్ళబోయ్యాలా, ఇంత సానుభూతి చూపించాలా—అని మీనాక్షిలో ఒక పెద్ద తుపాను చెలరేగింది!

సుందర్రావు పడుతున్న తొట్రుపాటు గమనించి, ఆతనికి మనస్థిమితం చిక్కేందుకు వీలుగా

'ఇందులో అబద్ధమేమీ లేదు; అంతా నిజమే! అందువల్ల ముందు తప్పు చేసింది నేను...' అంది తను చేసిన తప్పు ఇప్పుడు సుందర్రావు చెయ్యబోయే తప్పంత ఘోరమైనది కాదన్న ఆత్మవిశ్వాసాన్ని మరుగుపరుచుకుంటూ.

నువ్వంత పతితురాలవు కావు, మాబోటిదానివే—అని అభయ మివ్వగల ఆపేక్షత మీనాక్షి తన కిచ్చినట్లనిపించింది సుందర్రావుకి. 'ఐనా, ఫరవాలేదు మీనాక్షీ' అని కొంచెం తటపటాయించి 'అభ్యంతరం లేకపోతే నీ కొక విషయం చెప్పాలనుకుంటున్నాను' అన్నాడు.

'అనుమాన మెందుకు చెప్పండి'

'మన మెక్కడికైనా వెళ్ళిపోదాం. వివాహం చేసుకుందాం. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను...' అనర్హురాలైన మీనాక్షికి కావలసినంత గౌరవం కట్టబెడతానన్నట్టు కవిత్వధోరణిలో చాలాసేపు మాట్లాడాడు సుందర్రావు.

మీనాక్షి హృదయంలో ఒక అగ్నిపర్వతం పగిలినట్లయింది. సరస్వతి, సుశీల మొదలైనవాళ్ళనందరినీ మించిన క్షుద్రుడు సుందర్రావు అనుకుంది. కపటసానుభూతులమాటున తాము మర్యాదస్తులమన్న గర్వం సుందర్రావులో ఎంత దాసుందో!—అనుకుంది.

కట్టుకున్న భార్యతో కాపరం చేస్తూ, నిన్నటిదాకా అదే స్వర్గమని మురిసిపోయినవాడు ఇవ్వాళ్ళ తనని లేవదీసుకుపోయి ఉద్ధరిస్తాడట!—తను తప్పు చేసి ఉండవచ్చునుగాని, ఇలాటి ఉద్ధరింపులు తనేమీ ఎరగదే! ఈ నీతిపరుడికి నీతి గరపటమెలా?

'ఎందుకొచ్చిందిలెండి...ఇదొక గొడవ అవుతుంది మళ్ళీ' అంది మీనాక్షి చాలా లాలనగా.

తన కోర్కెను అంత సౌమ్యంగా తీసుకునేసరికి సుందర్రావుకి చాలా ధైర్యం వచ్చింది. 'భయంలేదు మీనాక్షీ! నువ్వు దగ్గిరుంటే నేను నరకంలో కూడా సుఖంగా ఉండగలను; నే నెవళ్ళనీ లెక్క చెయ్యను...'

ఈ కవిత్వ ధోరణికి మీనాక్షి చిరునవ్వు నవ్వింది. సుందర్రావు మురిసిపోయాడు!

'కన్నతల్లిని, తండ్రిని కాదనవలసి వస్తుంది ఎందుకులెండి...' అంది గోముగా.

'నా కేమీ విచారం లేదు మీనాక్షీ!' అన్నాడు సుందర్రావు!

''మీ భార్యను వదిలివేయవలసి వస్తుంది!'' అలా చేయించటం తన కిష్టంలేనట్టు!

''సరస్వతంటే అసలు నాకు మొదటినుంచీ ఇష్టంలేదు, మీనాక్షీ!'' అన్నాడు—అబద్ధమాడుతున్నావని అంతరాత్మ గుచ్చిగుచ్చి చెపుతూనే వున్నా!

'ఈ మీ ప్రవర్తనవల్ల మీ చెల్లెలికి వివాహం కాకపోవచ్చు!'

'అది నా కనవసరం' అన్నాడు సుందర్రావు నిస్సంకోచంగా.

'నేనే నా మీ కవసరం?' అంది నవ్వుతూ.

'ఔను! నన్ను నమ్ము మీనాక్షీ! ఏటికి ఎదురీదుతాను!'

మీనాక్షి పకక్కుమన్నది!

సుందర్రావు ఏటి కెదురీదాడు—చేతి కందినన్ని నగలూ, నాణ్యాలూ సేకరించి మీనాక్షితో ఢిల్లీకిపోయే గ్రాండ్ ట్రంక్‌లో పడ్డాడు. రైలు ముందుకి సాగుతున్న కొద్దీ తను స్వర్గానికి ఎగబాకుతున్నట్లుంది.

ఎంత ఆపుకుందామన్నా తెల్లవారుఝామున కునుకుపట్టింది తెల్లవారి నిద్రలేచి చూచేసరికి మీనాక్షి ఐపులేదు. తన కోటుజేబులో ఉత్తరం ఉంది—మీరు కట్టబెడదామనుకున్న గౌరవానికి నేను తగనిదానిని. కాని, మీకు, మీవాళ్ళకి ఇంత గౌరవం ఉంచటంకూడా నాకు ఇష్టంలేదు. ఈపాటి మచ్చ మీ వంశానికి అవసరమనే మిమ్మల్ని ఈ పనికి ప్రోత్సహించాను—అని!

పెట్టె వెతికితే డబ్బుమూట లేదు!

సుందర్రావు ఇల్లుచేరుకున్నాడు చివరికి—అప్రతిష్ఠమాత్రం మిగిలింది!

ఆనాటి మీనాక్షి ఈనాడు మళ్ళీ చంద్రమౌళి భార్యగా మద్రాసులో ఎదురైంది! ఇంత గ్రంథం నడిచినమీదట సుందర్రావుకి చంద్రమౌళి

ఇంటికి వెళ్ళటానికి తెరుపుగా ఉందంటే ఆశ్చర్య పడవలసిన పనిలేదు!

'చంద్రమౌళి భార్య మరెవరోకాదు. మీనాక్షిరా!' అన్నాడు సుందరస్వామి, రామ్మూర్తితో, వెనకటి గొడవలన్నీ చంద్రమౌళి ముందు ఎత్తవద్దని ప్రాధేయపడుతున్నట్లు.

ఇద్దరూ ట్రిప్లికేన్ బస్సుదిగి రోడ్డుదాటి సందుమలుపు తిరిగారు. 'అయినా, చంద్రమౌళి భార్య మీనాక్షేనని నీ కెలా తెలుసురాబావా!' అన్నాడు రామ్మూర్తి.

'నేను చూశానురా!' అన్నాడు సుందరస్వామి.

'ఎప్పుడు?'

'ఇప్పుడే!'

'మన మింకా అక్కడికి చేరనేలేదాయె—అప్పుడే ఎట్లా పసిగట్టావురా' అని ఒక క్షణం సుందరస్వామి వైపుచూసి 'ఐతే...నాకంటె ముందువచ్చి ఈవిషయం తెలిసి భయపడి పారిపోయివస్తూ నా కెదురయ్యావా, ఏరాబావా!' అని రామ్మూర్తి విరగబడి నవ్వటం ప్రారంభించాడు.

సుందరస్వామి చెప్పిన సమాధానాన్ని రామ్మూర్తి నవ్వు మింగేసింది.

రామ్మూర్తి ఇంకా నవ్వుతున్నాడు.

ఇతరులు కష్టాల్లో ఉంటే తను చూచి సంతోషించే వెధవ స్వభావం రామ్మూర్తిది అని మళ్ళీ ఒకసారి అనుకున్నాడు సుందరస్వామి.

'భేష్! నువ్వేరాబావా, గుండెలు తీసిన బంటువి!' అన్నాడు మేడమెట్లెక్కుతూ రామ్మూర్తి.

సుందరస్వామి అధైర్యాన్ని తల్చుకుంటూ, చంద్రమౌళిని అల్లంత దూరాన చూడగానే—నవ్వుల మాటున ఇంతవరకు మనసులో మరుగుపడిపోయిన ఆ రహస్యం...చంద్రమౌళి సాహసం...నీటిబుడగలాగ వెలికివస్తున్నట్లనిపించింది రామ్మూర్తికి. ఒక పెద్ద బరువు దించినట్లయింది వాడి మనస్సుకి!—బావమరిది చెవి కొరికాడు, 'చంద్రమౌళి మీనాక్షి వివాహం చేసుకోకముందే భార్యాభర్తలుగా వ్యవహరించారు!' అని.

ఇంత రహస్యం వాళ్ళిద్దరిముందు వినవలసివచ్చేసరికి కళవిళపడ్డాడు సుందరస్వామి. 'ఇది నీ కెలా తెలుసురా?' అందామనుకున్నాడు. కాని, ఇంతలో రహస్యంగానైనా ఈ ప్రశ్న వెయ్యటానికి వీలులేనంత దగ్గరకు వచ్చేశారు చంద్రమౌళి, మీనాక్షి.

విశేషమేమంటే—అన్ని విషయాలు తెలిసికూడా అందరిని నగుబాటుపాలు చేసింది రామ్మూర్తేనని మీనాక్షి తనపై పగపట్టిఉన్నదన్న విషయం విందుకు వెడుతున్న గుండెలు తీసిన బంటు, రామ్మూర్తికి తెలీదు!

అతన్నెలా సత్కరించిందో వాళ్లు బైటికొస్తేనేకాని బైటపడదు కూడాను!